క్లుప్తంగా

ఉత్సాహంగా కేజీబీవీ వార్షికోత్సవం

భీమునిపట్నం: భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయ(కేజీబీవీ) వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సమగ్ర శిక్ష ఏపీసీపీ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థినులు భవిష్యత్ లక్ష్యాలు నిర్దేశించుకుని చక్కగా చదివితే ఏమైనా సాధించగలరన్నారు. సమగ్ర శిక్ష జీసీడీవో కలెషాబేగం మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ ఉంటుందని, దాన్ని గుర్తించి అందులో శ్రమిస్తే మంచి ఫలితాలు పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యాలయ ప్రిన్సిపాల్ గంగాకుమారి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

562 మందికి వైద్య పరీక్షలు

పద్మనాభం: మండలంలోని నేరెళ్లవలస పంచాయతీ విజయానందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 562 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 27 మందికి కంటి పరీక్షలు జరిపారు. వైద్యులు మణి కుమారి, ప్రతిభ, వర్మ, శ్రీనివాసరావు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సారిక శంకరరావు, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

షూటింగ్ బాల్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులతో స్కూల్ డైరెక్టర్ శ్రీనివాసరావు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న సన్ స్కూల్ విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఇటీవల ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొన్న ఇక్కడి విద్యార్థుల్లో ఆరుగురు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 31న, ఫిబ్రవరి 1న ప్రకాశం జిల్లా చీరాలలో జరగబోయే జాతీయ పోటీల్లో పాల్గొంటారు. వీరిని పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కైతపల్లి శ్రీనివాసరావు అభినందించారు. ఇప్పటి వరకు ఆడిన స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని గెలుపొందాలని ఆయన కోరారు.

అనధికార నిర్మాణంపై జెడ్సీ ఆగ్రహం



నగరపాలెంలో అనధికార నిర్మాణాన్ని పరిశీలిస్తున్న జెడ్సీ బొడ్డేపల్లి రాము

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెంలో రోడ్డు విస్తరణ పనులను జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము మంగళవారం ఉదయం పరిశీలించారు. అయితే కె.నగరపాలెంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండగానే అనుమతులు లేకుండా ఆ రోడ్డును ఆనుకుని నిర్మాణాలు చేపట్టడంతో జెడ్సీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కమర్షియల్ నిర్మాణాలు చేపట్టేటప్పుడు రోడ్డుకు, డ్రైనేజీకి 10 అడుగుల స్థలం కూడా ఉంచకుండా ఎలా చేపడతారని ప్రశ్నించారు. వీటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యార్థులకు నగదు పారితోషకం

పద్మనాభం: పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల తల్లులకు భీమునిపట్నం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్న నాగోతు నాగమణి మంగళవారం నగదు పారితోషకం అందజేశారు. 547 మార్కులు సాధించి తొలిస్థానంలో నిలిచిన రామినేని అంజలితల్లికి రూ.3వేలు, 532 మార్కులతో రెండో స్థానంలో నిలిచిన బుగత హేమలత తల్లికి రూ.2వేలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎ.బాలాజీ, ఉపాధ్యాయులు ఎల్.అప్పారావు, టి.రామకృష్ణ, ఎస్.గోవింద పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం జగన్

- వారి పేరునే సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

ఆనందపురం : రాష్ట్రంలో అన్ని సంక్షేమ పథకాలను మహిళల పేరునే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని, ఆయన మహిళా పక్షపాతి అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని 26 పంచాయతీల్లోని 1,293 డ్వాక్రా గ్రూపుల్లో గల 13,701 మంది సభ్యులకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.10.45 కోట్ల చెక్కు తర్లువాడలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా తర్లువాడలో రూ.46.23 లక్షలతో నిర్మించనున్న మంచినీటి పథకానికి శంకుస్థాపన చేసి... రూ.28 లక్షలతో పూర్తి చేసిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆసరా నాలుగో విడత కింద భీమిలి నియోజకవర్గంలోని మహిళలకు రూ.344.46 కోట్ల సాయాన్ని పంపిణీ చేశారన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలకు రూపకల్పన చేశారన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు జరుపుతున్నది మన ప్రభుత్వమేనని చెప్పారు. మహిళలకు రుణమాఫీ చేస్తానని, సున్నా వడ్డీ రుణాలు అందిస్తామని వాగ్దానం చేసిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన అనంతరం అమలు జరపకుండా మోసం చేశారని ఆరోపించారు. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను దోచుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా ఖాతాదారుల ఖాతాలో జమ చేస్తున్నామని చెప్పారు. మహిళలు శక్తివంతులు అయితేనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ఎన్నుకుంటేనే సంక్షేమ పథకాలన్నీ సక్రమంగా అమలు జరుగుతాయన్నారు. మేలు చేయని ఇతర పార్టీలను ఆదరిస్తే వలంటీర్ వ్యవస్థను, సచివాలయ వ్యవస్థను రద్దు చేస్తారని... దీని వల్ల ప్రజలు మరలా దోపిడీకి గురవుతారని చెప్పారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. భీమిలి నుంచి తనను మరలా గెలిపిస్తే ప్రజలకు మరింత సేవ చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభారాణి, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, మండల అధ్యక్షుడు బంక సత్యం, ఎంపీడీవో అడపా లవరాజు, భీమిలి మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బోని అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు పాండ్రంకి శ్రీను, బొట్టా ధనలక్ష్మి, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రంకి అప్పారావు, నాయకులు బంటుబిల్లి మణిశంకర నాయుడు, మజ్జి రమేష్‌నాయుడు, పిన్నింటి వెంకటరమణ, కోరాడ ముసలినాయుడు, గండ్రెడ్డి శ్రీనివాస్, చందక అప్పలస్వామి, లెంక రాంబాబు, చందక సూరిబాబు, లొడగల రమణ, బొట్టా రామకృష్ణ, కోరాడ వెంకట రమణరావు తదితరులు పాల్గొన్నారు.



సభలో సీఎం జగన్‌కు మద్దతు తెలుపుతున్న మహిళలు

సీఎం జగన్ సాయంతో జీవనోపాధి



భర్త చనిపోయి, పిల్లలు లేక ఒంటరిగా జీవిస్తున్నాను. పైడితల్లమ్మ గ్రూపులో సభ్యురాలినైన నాకు ఆసరా ద్వారా నాలుగు విడతలగా రూ.18 వేలు వచ్చింది. చేయూత ద్వారా ఇంత వరకు రూ.72 వేలు అందింది. ఆ సొమ్ముతో పాడి ఆవుని కొనుగోలు చేసుకున్నా. రోజూ రూ.200 ఆదాయం వస్తోంది. అలాగే ప్రతీ నెలా రూ.3 వేల పింఛను అందుతోంది. దీంతో సంతోషంగా జీవిస్తున్నా. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సాయంతో నేను ఒంటరిని అన్న విషయం మర్చిపోయాను. ఆ మహానుభావుడికి రుణపడి వుంటాను.

– షిణగం అప్పయ్యమ్మ, గిడిజాల, ఆనందపురం మండలం.

జగన్ బాబుకు రుణపడి వుంటాం



ఆనందపురం మండలం, కుసులువాడ పంచాయతీ, ఇచ్ఛాపురం గ్రామంలోని ముత్యమాంబ డ్వాక్రా గ్రూపు సభ్యురాలిని. నాకు ఇద్దరు పిల్లలు. ఇంటి పెద్ద లేకపోవడంతో పిల్లల పోషణ భారంగా మారింది. వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.8 వేలు, చేయూత ద్వారా రూ.72 వేలతోపాటు ప్రతీ నెల రూ.3 వేలు వితంతు పింఛను అందుతోంది. ఆ మొత్తాలను వ్యవసాయానికి పెట్టుబడి పెట్టాను. అలాగే రెండు మేకలు కొనుగోలు చేసి మేపుకుంటున్నాను. దీంతో నా కుటుంబం జీవించడానికి ఇబ్బంది లేకుండా ఉంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

– వరపుల దేముడమ్మ, ఇచ్ఛాపురం, కుసులువాడ పంచాయతీ, ఆనందపురం మండలం.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



బంతి, చామంతుల అలంకరణలో కొత్తమ్మతల్లి



వివిధ రకాల పువ్వులతో అలంకరణలో రాస పోలమాంబ అమ్మవారు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని మంగళవారం బంతి, చామంతి, గజమాలలతో అలంకరించారు. రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో జీరు వాసురెడ్డి ఆర్థిక సహకారంతో అలంకరణ పూర్తి చేశారు. ఈ అలంకరణకు భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరావు సహకారం అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారి సేవలో ఉంటున్న పోతల నరసయ్యమ్మకు వెంపాడ వెల్ఫేర్ సొసైటీ, ఓఎస్‌జీ ఫౌండేషన్ సహకారంతో ఆలయ కమిటీ ప్రతినిధులు బియ్యం, నిత్యావసర సరకులు అందించారు.

- భీమిలి మండలం మజ్జివలస కూడలిలోని రాస పోలమాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు 9 రకాల పువ్వులు, తులసిమాలలతో అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా బంగారమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం



అన్నదానం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ దసపల్లా లే అవుట్‌లో గల శ్రీ బంగారమ్మ తల్లి ఆలయ 7వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. మధ్యాహ్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని మహా అన్నదానం ప్రారంభించారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, ఉప్పులూరి గోపి, మాదు చంటి, చెట్టుపల్లి గోపి, చెన్నా దాస్, దువ్వి వాసు, అల్లాడ ఉమామహేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వెల్డింగ్ షాప్‌లో అగ్ని ప్రమాదం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో సోమవారం అర్ధరాత్రి ఓ వెల్డింగ్ షాప్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. షాపు యజమాని దుంప రమణ తెలిపిన వివరాల ప్రకారం... షాప్‌లో విద్యుత్ మీటర్ సమీపంలో జాయింట్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో ప్రమాదం సంభవించింది. షాప్ మూసివేసి ఇంటికి వెళ్లిన తర్వాత ప్రమాదం సంభవించిందని, స్థానికులు గమనించి సమాచారం ఇచ్చి మంటలు అదుపులోకి తీసుకొచ్చినప్పటికీ సామగ్రి మొత్తం కాలిపోయిందని వాపోయారు. సుమారు రూ.2 లక్షల ఆస్తి నష్టం కలిగిందని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం



ఐఐటీ విజేతలతో సీఐ కాంతారావు, తదితరులు

మధురవాడ: విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని పీఎం పాలెం ట్రాఫిక్ సీఐ కాంతారావు సూచించారు. మంగళవారం కొమ్మాది డబుల్ రోడ్డులోని విజయం స్కూల్‌లో రహదారి భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కాంతారావు మాట్లాడుతూ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌తోపాటు వ్యక్తిగత భద్రతపై అవగాహన కల్పించారు. బస్సుల డ్రైవర్లు నిబంధనలు పాటించాలని సూచించారు. గ్రీన్ వేలీ ఫౌండేషన్ నిర్వాహకురాలు ఉమారాజ్ మాట్లాడుతూ మత్తుతో జీవితాలు చిత్తు అవుతున్నాయని, ఆ వ్యసనానికి అంతా దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఐఐటీ విజేతలకు మెడల్స్ అందజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ కె.విజయలక్ష్మి, ట్రాఫిక్ ఎస్ఐ ఎం.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

19,357 ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు



సచివాలయ ఏఎన్‌ఎమ్, సెక్రటరీలకు కార్డులు అందజేస్తున్న జెడ్సీ కనక మహాలక్ష్మి

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2లో 5 నుంచి 13 వార్డుల్లో గల 91 సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు 19,357 ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరయ్యాయి. వీటిని మధురవాడ జోనల్ కార్యాలయంలో జెడ్సీ కొట్యాడ కనకమహాలక్ష్మి ఏఎన్‌ఎమ్‌లు, ఇతర కార్యదర్శులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వం ఆదాయ పరిమితి రూ.25 లక్షలకు పెంచి మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డులు ఆపదకాలంలో ఎంతో ఉపయోగపడతాయన్నారు. వీటిని ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారులకు తక్షణమే అందజేయాలని ఆదేశించారు. పంపిణీలో నిర్లక్ష్యం వహించ వద్దని, లబ్ధిదారుకే నేరుగా అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

యోగా, ధ్యానంతో ఒత్తిడి దూరం



ప్రసంగిస్తున్న ఆధ్యాత్మికవేత్త గురుదేవ్ రవిశంకర్

కొమ్మాది: యోగా, ధ్యానంతో అంతర్గత శక్తులను మేల్కొల్పడంతోపాటు ఒత్తిడి దూరం చేసుకోవచ్చని ఆధ్యాత్మికవేత్త గురుదేవ్ రవిశంకర్ అన్నారు. సమాజంలో మానవత విలువలు పెంచడానికి కలిసి నడుద్దాం, కలిసి ఎదుగుదాం, ముందుకు సాగుదాం అనే నినాదంతోపాటు మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా యువత ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిస్తూ గీతంలో మంగళవారం నిర్వహించిన ఎడు యూత్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి ప్రపంచంలో యువత ఎక్కువ శాతం మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని, దాని నుంచి బయటపడటానికి కొందరు మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశం ఎన్నో రంగాల్లో పురోభివృద్ధి సాధిస్తోందని, యువత చైతన్యవంతంగా మారితే ప్రపంచంలో అగ్రస్థానంలో నిలపవచ్చన్నారు. ప్రతీ ఒక్కరూ తమలోని శాస్త్రవేత్తను బయటకు తీయాలని, దేశం గర్వించదగ్గ వ్యక్తులుగా మారాలని పిలుపునిచ్చారు. అనంతరం డ్రగ్స్ వాడకాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

మంచి పాలనతో పంచాయతీకి అవార్డు



టి.నగరపాలెం సర్పంచ్ ఛాయాగౌతమి దంపతులను అభినందిస్తున్న సభ్యులు

తగరపువలస: ఇటీవల ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీ సర్పంచ్ పాట్నూరు ఛాయాగౌతమికి 'మంచి పాలన' విభాగంలో అవార్డు లభించింది. ఈ సందర్భంగా మంగళవారం పంచాయతీకి చెందిన శ్రీకృష్ణ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఛాయాగౌతమి, చంద్రశేఖర్ దంపతులను సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా పంచాయతీ కీర్తిని ఢిల్లీ వరకు తీసుకెళ్లిన ఘనత సర్పంచ్ ఛాయాగౌతమికి దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో అర్చకుడు పెంట వెంకటరమణ శర్మ, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, సన్యాసిరావు, వైస్ ప్రెసిడెంట్ గారి బంగారురాజు, వార్డు సభ్యుడు సూరిబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోరాడ అప్పలనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

మే 27 నుంచి సుత్తమ్మతల్లి ఉత్సవాలకు సన్నాహాలు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ, మూలకుద్దు పంచాయతీలకు చెందిన గ్రామదేవత సుత్తమ్మతల్లి ఉత్సవాలను మే 27 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. పెళ్లి ముహూర్తాలకు సంబంధించి ఇబ్బందులు తలెత్తకుండా ఈ తేదీలను ముందుగా ప్రకటించినట్టు తెలిసింది. అదే నెలలో మరిడమ్మ, రాజ్యలక్ష్మి, పోలమ్మ పండగలు నిర్వహించి... అనంతరం సుత్తమ్మతల్లి ఉత్సవాలు నిర్వహించనున్నారు.

మహాత్మునికి ఘన నివాళి



ఆదర్శహిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బంగ్లామెట్ట విద్యార్థులు

తగరపువలస: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం పలుచోట్ల ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక నివాళులర్పించారు. భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, విద్యార్థులు గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గొట్టిపల్లి సత్యనారాయణ, దుంపల దాలయ్యబాబు గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు.

పద్మనాభం: మండలంలోని మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గాంధీ విగ్రహానికి ఎంపీపీ కంటుబోతు రాంబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పారావు, ఎర్రయ్య, శైలజ, మమత పాల్గొన్నారు.

మధురవాడ: చంద్రంపాలెం బాపూజీ కళా మందిరంలో జాతిపిత గాంధీ విగ్రహానికి సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పిళ్లా సూరిబాబు, పోతిన పైడిరాజు, పిళ్లా పోతురాజు, పిళ్లా అప్పన్న, జగ్గుపిల్లి అప్పారావు, పీస రామారావు తదితరులు నివాళులర్పించారు.

- కొమ్మాది జంక్షన్ పెట్రోల్ బంక్ వద్ద గల గాంధీ విగ్రహానికి సీఐటీయూ నాయకులు పి.రాజ్‌కుమార్, డి.అప్పలరాజు, జి.కిరణ్, పి.రవికుమార్, జి.ఎర్రన్న, వెంకటరావు, సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు.

పీఎం పాలెం: భారత జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గాదె రోశిరెడ్డి, పోతిన సూరిబాబు, వీవీ నరసింహారావు, వేంకటేశ్వర్లు, కాశీ ప్రసాద్, వేంకటేశ్వర రెడ్డి, జి.వేణుగోపాలరెడ్డి, ఎస్.సన్యాసిరావు పాల్గొన్నారు.

- స్థానిక తులసీనగర్ పార్కులో బాపూజీ వర్ధంతిని మంగళవారం వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది విద్యార్థులకు రాత్రి భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు జ్యోతికమల, కోశాధికారి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీలోని గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



బాపూజీ కళామందిరం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు



మద్ది హైస్కూల్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ రాంబాబు, తదితరులు

సిగ్నల్ స్తంభాన్ని ఢీకొట్టిన జీవీఎంసీ వాహనం



సిగ్నల్ స్తంభాన్ని ఢీకొట్టి నిలిచిన వాహనం

పీఎం పాలెం: స్థానిక క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న సిగ్నల్ పాయింట్ వద్ద జీవీఎంసీ వాహనం స్తంభాన్ని ఢీకొట్టింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం.వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీకి చెందిన వాహనం మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో నగరం వైపునకు వెళ్తుండగా... క్రికెట్ స్టేడియం ఎదురుగా వచ్చేసరికి డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఆ సమయంలో రోడ్డు క్రాస్ చేసే వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. జీవీఎంసీ వాహనం డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఆ సమయంలో వాహనం డ్రైవర్ మద్యం సేవించి ఉన్నట్టు గుర్తించామని ఎస్ఐ తెలిపారు.

ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

తగరపువలస: పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న చిట్టివలస ఫ్రెండ్స్ సొసైటీ సేవలు అభినందనీయమని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. గత మూడేళ్లలో నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన 50 మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మంగళవారం సాయంత్రం చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను, ఇటీవల యూజీసీ నెట్‌కు ఎంపికైన ఉపాధ్యాయుడు ఎం.అప్పలరాజుతోపాటు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పాట్నూరు మురళీమోహన్‌రావు, రెడ్డిపల్లి అప్పలరాజును సన్మానించారు. అనంతరం 2024 శిక్షణను ఆమె ప్రారంభించారు. ఎంఈవో శివరాణి, డైట్ అధ్యాపకుడు జి.రవి, సొసైటీ గౌరవ అధ్యక్షుడు దత్తి ఈశ్వరరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు గంటాన మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, ఉపాధ్యాయులు యాగాటి వెంకటరమణ, పక్కి నాగేశ్వరరావు పాల్గొన్నారు.